గోలీలాట

"నా దగ్గర గోలీలున్నాయి" అన్నాడు రవి తన పిడికిల్లో సీసపు గోలీలను పట్టుకొని.

"నా దగ్గర వున్నాయి" అన్నాడు శంకర్ తన నిక్కర్ జేబును చూపిస్తు. జేబు ఉబ్బి వుంది.

"ఆడుకుందామా"

"ఓ" అంటు జేబులోని గోలీలను చేతిలోకి తీసుకున్నాడు శంకర్.

ఓ పదునైన రాయిని తీసుకుని నేలను పొక్కిలిచేసి, మట్టిని తోడి గుంటను చేశాడు రవి.

శంకర్ గుంటకు కొంత దూరాన, గీతలు గీసి, అక్కడనిల్చుని గోలీని గుంటలోకి విసిరాడు.

అలాగే రవికూడ విసిరాడు. ఆ తరువాత గురిచూసి చుట్టువున్న గోలీలను వేలితో చిమ్మాడు. రవి టకటక శంకర్ గోలీలను కొట్టి అన్నిటిని గెల్చుకున్నాడు.

శంకర్ ఓడిపోయినట్టుగ నిలుచున్నాడు. తన గోలీలన్ని వడిసిపోయాయి కనుక యిక తను ఆడలేదు.

రవి గెల్చుకున్న గోలీలను జేబుల్లో నింపుకొని విజేతలాగ నవ్వుతు నిలుచున్నాడు.

"నాకు నాలుగు గోలీలు అప్పుగ యివ్వు. నేను మళ్లీ ఆడి ఆ తరువాత నీ అప్పు తీర్చుతాను". అన్నాడు శంకర్.

"అమ్మో నేను అప్పిస్తే, నీవు ఆడి నా గోలీలను అన్నిటిని గెలుచుకుంటే" అన్నాడు రవి అనుమానంగా.

చీకటి పడింది. ఇద్దరు తమ ఇళ్లకు చేరుకున్నారు.

"నేను యివ్వను" అన్నాడు రవి రాత్రి నిద్రలో.

"ఇవ్వనంటే యివ్వను" మళ్లీ అన్నాడు.

"నా బొక్క యిడవర" ఈసారి ఉద్రేకంగా అన్నాడు.

"రవి, ఒరె రవి" అంటు చేత్తో కదుపుతు పిలిచాడు తండ్రి.

"ఒదులు, ఒదులుర" అంటు అటు యిటు కదిలాడు.

"దేన్నిర ఒదిలేది. లే, లేచి కూర్చో" అన్నాడు తండ్రి.

రవి కళ్లు తెరిచి అటు యిటు చూస్తూ లేచి కూర్చున్నాడు.

"ఏంనాన్న ఎందుకట్ల కలవరిస్తున్నావు" అన్నాడు తండ్రి.

తండ్రి ముఖంలోకి అదోమాదిరి చూసి తలదించుకున్నాడు రవి.

"పడుకో మంచినీళ్లు తాగుతావా ?" అని అడిగాడు.

వద్దన్నట్టు తల ఆడించాడు రవి. కాని అతనిలో ఏదో ఆందోళన కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. నుదిటిమీద చెమట బిందువులు చేరినయి.

"ఎందుకట్ల కలతగ వున్నావు"

ఏమి లేదన్నట్టు తలాడించాడు అమాయకంగా.

"అయితే పడుకో" అంటు కాళ్లమీది చద్దర్‌ను ఎదమీదికి గుంజబోయాడు. అప్పుడు నిక్కర్‌జేబి దగ్గర చేతికి ఏవో గట్టిగ

తగిలాయి. రెండవవైపు తడిమి చూశాడు. ఆ జేబు గట్టిగానే తగిలింది. వాటిని తడిమి తడిమి చూస్తు "ఎక్కడివిరా యిన్ని గోలీలు. పొద్దంత వాటితో ఆడడమేనా" అన్నాడు.

"ఎన్ని పైసలు తగలేసి కొన్నావు" అన్నాడు మళ్లీతానే.

రవి 'వాటిని కొనలేదు' అన్నట్టు తలనుకదిలించాడు.

"మరెక్కడివి?"

"గెల్చినయి"

"అవన్ని గెల్చినయెనా"

"హు" అన్నాడు

"ఆటలు ఆడాలి. కాని పొద్దంతా కాదు. ఎప్పుడో ఓసారి ఆడాలి. ఈలాంటి ఆటల్లో గెలుచుకున్న గోలీలు, ఆట ముగిసినాక ఎవరివి వారికి యిచ్చేయాలి".

"హు గెల్చినంక ఎందుకియ్యాలె" అని అయిష్టంగా పక్కమీదికి వొత్తిగిల్లి పడుకున్నాడు.

"యిస్తేమంచిది. ఏ ఆటలోనైన గెలుపు ముఖ్యమేకాని వస్తువుకాదు" భుజం మీద చేయివుంచుతూ అన్నాడు.

"గెలుచుకున్నంక ఎవ్వరు యివ్వరు".

"నీవైతె యిస్తూ వుండు. నిన్నుచూచి మిగతావాళ్లు కూడ యిస్తారు."

రవి మౌనంగా చూస్తువుండి పోయాడు".

"ఇంతకుముందు యివ్వను, యివ్వను అని కలువరించావు గోలికాయలేనా ?" అంటు అడిగాడు.

"శంకర్‌తో ఆడి గెల్చిన, మళ్లి ఆడుదాం కొన్ని అప్పుగ యివ్వమన్నాడు".

"ఇవ్వ వలిసింది"

రవి మాట్లాడలేదు.

"ఏ ఆటలోనైనా గెలిచేనైపుణ్యాన్ని సంపాదించడం గొప్ప కాని, ఎదుటివాళ్ల వస్తువునుకోరకూడదు."

రవి తండ్రి ముఖంలోకి చూస్తు వింటు వున్నాడు.

ఆటను ఆటగ ఆడి ఆనందించాలికాని జూదంగ మార్చకూడదు. కలతలను తెస్తుంది. అప్పుడు మనిషి నిద్రకుదూరమౌతాడు. రేపు శంకర్ గోలీలు శంకరికిచ్చేయ్. ఇక నీవు హాయిగ నిద్రపో" అంటు చద్దర్ మెడలవరకు కప్పి, తాను పక్కమ్మటే పడుకున్నాడు.

"వాని గోలీలు వానికి రేపు ఇచ్చెయ్యాలె" అనుకుంటు రవి ప్రశాంతంగ నిద్రలోకి జారుకున్నాడు.